కనుమురుగు..!

ప్రశ్నార్థకంగా బంగ్లామెట్ట వద్ద గెడ్డ ఉనికి ▪ గోస్తనీ నది వరదలకు పొంచి ఉన్న ముంపు ముప్పు

తగరపువలస పట్టణ ప్రజల ఆందోళన ▪ స్పందించని రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు



బంగ్లామెట్ట దిగువ గెడ్డగా మారి మురుగు నీరు వెళ్లే పెద్ద బంటా



గెడ్డను పూడ్చివేయడానికి ప్రయత్నించిన దృశ్యం



బంగ్లామెట్ట శివాలయం వద్ద డ్రైనేజీ ప్రారంభమైన చోటు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట శివాలయం నుంచి గోస్తనీ నదిలోకి వెళ్లే గెడ్డ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తగరపువలస మెయిన్ రోడ్డుకు ఇరువైపులా గ్రామాలతోపాటు భీమిలి రోడ్డు, బంగ్లామెట్ట, కొండపేట గ్రామాల నుంచి మురుగు నీరు పూర్వకాలం నుంచి శివాలయం ముందుగా డ్రైనేజీ ద్వారా పెద్ద బంటాలో చేరి అక్కడి నుంచి గోస్తనీ నదిలో కలిసేది. కాలక్రమేణా శివాలయం ముందు బంటా ఆక్రమణల జాబితాలో చేరిపోయి చిక్కిపోగా ఇప్పుడు గోస్తనీ నదిలో కలిసే గెడ్డ కూడా మాయమవుతోందని తగరపువలస పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గెడ్డను కప్పేస్తున్నారంటూ ఫిర్యాదులు

గతంలో ఈ గెడ్డలను ఆనుకుని సంతపేట, బంగ్లామెట్ట, భోగాపురపువారి వీధి గ్రామస్తులు మెట్ట పంటలు సాగు చేసేవారు. 35 ఏళ్ల కిందటే వీరు వ్యవసాయం మానేసి భూములు విక్రయించారు. ప్రస్తుతం ఈ భూములు పలువురి చేతులు మారిపోయాయి. వీటి యజమానులు అభివృద్ధిలో భాగంగా గెడ్డను కప్పివేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తూ ఇటీవల జీవీఎంసీ, భీమిలి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గెడ్డను కప్పితే గోస్తనీ నది వరదలకు బంగ్లామెట్టతోపాటు తగరపువలస ముంపునకు గురవుతుందని వీరు ఆందోళన వ్యక్తం చేయగా.. భూముల యజమానులు మాత్రం వర్షాలకు భూమి కోతకు గురై గెడ్డగా మారిందని, వాస్తవంగా గెడ్డ భూమంతా జిరాయితీయేనని వాదిస్తున్నారు.

భూముల యజమానులు, పట్టణ ప్రజల మధ్య వివాదం

ఆది నుంచి బంగ్లామెట్ట శివాలయం మొదలుకుని డ్రైనేజీ ద్వారా మురుగు గోస్తనీ నదిలోకి చేరిందని, ఆ గెడ్డ ఏమైందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇక్కడ గెడ్డ ఏ భాగంలో ఉండేది, అసలు గోస్తనీ నదిలోకి మురుగు నీరు ఎలా చేరేదని చూపించవలసిన బాధ్యత రెవెన్యూ, జీవీఎంసీ అధికారులపై ఉన్నా.. స్పందించడం లేదు. దీంతో భూముల యజమానులు, పట్టణ ప్రజల మధ్య వివాదం రోజురోజుకూ పెద్దదవుతోంది. ఇప్పటికే బంగ్లామెట్ట శివాలయం ముందు బంటా భాగంతోపాటు మురుగు ప్రవహించే మార్గాలను బడా వ్యాపారులు కబ్జా చేశారని, ఇప్పుడు పాత గెడ్డలను కూడా మాయం చేస్తే ముంపు ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



గోస్తనీ నది నుంచి బంగ్లామెట్ట వరకు కనిపిస్తున్న గెడ్డ



గోస్తనీ నది ముఖద్వారం వద్ద గెడ్డ ద్వారా ప్రవహిస్తున్న మురుగు నీరు

క్లుప్తంగా

ఓటర్లు ఎక్కువ ఉంటే అదనపు పోలింగ్ కేంద్రం



మాట్లాడుతున్న ఎన్నికల నిర్వహణ అధికారి సంగీత్ మాథుర్

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో అధిక మంది ఓటర్లు ఉండే ప్రాంతాల్లో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామని ఎన్నికల నిర్వహణ అధికారి, ఆర్డీవో సంగీత్ మాథుర్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం పలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా 2 వేలకు పైనే ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో మరో కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామన్నారు. ముందుగా దాని దగ్గరలో వేరే పోలింగ్ బూత్ ఉండి అక్కడ తక్కువ ఓటర్లుంటే అదనపు ఓటర్లను ఆ బూత్‌లో కలుపుతామని, అలే లేకపోతే కొత్త బూత్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీన్ని అందరూ గుర్తించాలని, ఏవైనా సమస్యలు గుర్తిస్తే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ యోగి తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థికి ట్రిపుల్ ఐటీ సీటు



జశ్వంత్

మధురవాడ: చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మరో విద్యార్థి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటరావు తెలిపారు. ఇప్పటికే ఏడుగురు విద్యార్థులు ఈ పాఠశాల నుంచి ఎంపిక కాగా.. రెండో దఫా కౌన్సెలింగ్‌లో ఎంపికైన జశ్వంత్‌తో ఈ సంఖ్య 8కి చేరింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ అచ్యుతరావు, కమిటీ సభ్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. జశ్వంత్ తల్లిదండ్రులిద్దరూ ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చి 10వ తరగతిలో 569 మార్కులు సాధించిన అల్లంపల్లి జశ్వంత్ ఉత్తమ ప్రతిభ చూపి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. తాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్ అవుతానని చెప్పాడు.

చెట్ల కొమ్మల తరలింపు



తొలగించిన చెట్ల కొమ్మలను తరలిస్తున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తొలగించిన చెట్ల కొమ్మలను సోమవారం తరలించారు. విద్యుత్ పనుల నిర్వహణ కారణంగా సిబ్బంది తొలగించిన చెట్ల కొమ్మలు రోడ్డుకు ఇరువైపులా వదిలి వేయడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యపై 'తొలగించిన చెట్ల కొమ్మలు తరలించరా?' అనే శీర్షికతో ఈ నెల 13న 'సాక్షి'లో వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన విద్యుత్ ఏఈ బొట్టా రవి ఆధ్వర్యంలో సిబ్బంది చెట్ల కొమ్మలను వాహనాల్లో తరలించారు.

నేడు అమ్మవార్ల సంబరాలు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ పాతూరుకు చెందిన ప్రజలు మంగళవారం ఎల్లారమ్మతల్లి, జట్లమ్మ, దుర్గాలమ్మ, జోడుగుళ్లమ్మలకు పసుపు కుంకుమలు, సారె సమర్పించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి పాతూరులో పూజారి ఇంటి వద్ద నుంచి ఈ సంబరాలు ప్రారంభం కానున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శివాజీ

మధురవాడ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మధురవాడకు చెందిన టీడీపీ నాయకుడు నాగోతి శివాజీ నియమితుడయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా అందుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు నాయకులకు శివాజీ కృతజ్ఞతలు తెలియజేశారు.

8వ వార్డులో ఆక్రమణలపై ఆర్డీవో ఆగ్రహం



ఎండాడలో ప్రభుత్వ స్థలం ఆక్రమణను పరిశీలిస్తున్న వీఆర్వో వెంకటేష్



బీసీ కాలనీలో ఆక్రమణలను పరిశీలిస్తున్న వీఆర్వో శ్రీనివాస్

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో విచ్చలవిడిగా సాగుతున్న ప్రభుత్వ భూ ఆక్రమణలపై ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతుంటే.. కిందిస్థాయి సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. 'రూ.3 కోట్ల ప్రభుత్వ స్థల ఆక్రమణ', 'కొండను త్రవ్వేస్తున్నారు..' అనే శీర్షికన 'సాక్షి'లో ఆది, సోమవారాలు ప్రచురించిన వరుస కథనాలపై ఆయన స్పందించారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలంటూ తహసీల్దార్ పాల్‌కిరణ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆదేశాలతో సోమవారం ఎండాడ రాజీవ్‌నగర్‌లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని వీఆర్వో వెంకటేష్, బీసీ కాలనీ సర్వే నంబర్ 1లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని వీఆర్వో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ బీసీ కాలనీలో 300 గజాల స్థలం ఆక్రమణ వాస్తవమేనని, ఆ స్థలంలో ఒక షెడ్ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. రెండు రోజుల్లో వీటిని ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు తెలిపామని, అనంతరం వాటిని తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. రాజీవ్‌నగర్‌లో ప్రభుత్వ స్థల ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని, ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. రుషికొండ ఐటీ జంక్షన్ సమీపంలో గతంలో వుడా రద్దు చేసిన ప్లాట్లలో ఓ వ్యక్తి ఆక్రమించి నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆదేశించారు.

అభివృద్ధి పనులను సూక్ష్మంగా పరిశీలించండి



8వ వార్డులో క్లాప్ వాహనాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

కొమ్మాది: జీవీఎంసీ పరిధిలో చేపడుతున్న రోడ్లు, కల్వర్టులు, కాలువలు, ఫుట్‌పాత్‌లు తదితర అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులు సూక్ష్మంగా పరిశీలించాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. 8వ వార్డు ఎండాడ వైఎల్‌పీ లేఅవుట్ ప్రాంతంలో 100 అడుగుల రహదారి అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోడ్డు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోడ్డు విస్తరణకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజు, ఏసీపీ తిరుపతిరావును ఆదేశించారు. ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డు అభివృద్ధి పనుల్లో అలసత్వం, అశ్రద్ధ వహించకుండా సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అనంతరం ఆ రోడ్డులో వెళ్తున్న క్లాప్ వాహనాలను జీవీఎంసీ కమిషనర్ పరిశీలించి ప్రజల అవగాహన కోసం ఏర్పాటు చేసిన మైక్ అనౌన్స్‌మెంట్ ఎందుకు వినియోగించడం లేదని డ్రైవర్‌ను ప్రశ్నించగా.. అది పనిచేయడం లేదని తెలపడంతో అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న కమిటీ కార్యదర్శి లక్ష్మణరావు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, ఐఆర్ఎస్ అధికారి ఎం.మహీధర్ పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అందించిన నగదు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమం సోమవారం పాఠశాల వద్ద నిర్వహించారు. ఇక్కడ ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థుల్లో వరుసగా రూ.5,000, రూ.3,000, రూ.2,000 చొప్పున తొమ్మిది మంది విద్యార్థులకు నగదు ప్రకటించగా.. ప్రథమ బహుమతులు సత్య అలేఖ్య, జి.అజయ్, షణ్ముఖరెడ్డి.. ద్వితీయ బహుమతులు ఎం.రమ్య, కె.మీనాక్షి, పి.సంజన.. తృతీయ బహుమతి ఎం.కౌశిక్, పి.పావని, పి.లావణ్య పొందారు. వీటిని విద్యార్థులకు శతాబ్ది ఉత్సవ కమిటీ కార్యదర్శి మైలిపల్లి లక్ష్మణరావు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను మహీధర్ ఫోన్‌లో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొన్నగంటి రమణ, ఉత్సవ కమిటీ సభ్యులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, రాజేటి బసవ కృష్ణమూర్తి, కనకల సన్యాసినాయుడు, టి.భీమారావు, ఆది నారాయణ, బోని సంజీవరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల



చిట్టివలస డిగ్రీ కళాశాలలో పాలిథిన్ వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే థీమ్‌తో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం కళాశాల ఆవరణలో పాలిథిన్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలలో ఒకసారి ప్లాస్టిక్ వస్తువులను సేకరించి చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి



మాట్లాడుతున్న కానూరి రాంబాబు

తగరపువలస: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి సామాన్యుల నడ్డి విరిచే కూటమి ప్రభుత్వం ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక గుజ్జు రాము నాయుడు భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గతంలో సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగించని విద్యుత్‌కు కూడా బిల్లులు వేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అదాని ఒప్పందాలు రద్దు చేసుకోవడంతోపాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోకపోతే దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, గోవిందరావు, సన్యాసిరావు, లక్ష్మణరావు, అప్పారావు పాల్గొన్నారు.

నృత్య నిలయానికి 'ఫ్యాబ్' విరాళం



నృత్య నిలయ నిర్వాహకురాలు కృష్ణవేణికి రూ.10 వేలు అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలిలోని కృష్ణ కూచిపూడి నృత్య నిలయానికి సోమవారం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) రూ.10 వేలు విరాళం అందించింది. ఈ సందర్భంగా ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ మాట్లాడుతూ కూచిపూడి కళను నృత్య నిలయ వ్యవస్థాపక శిక్షకురాలు కృష్ణవేణి ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. ఆమె కృషి వల్ల వందలాది మంది పిల్లలు కూచిపూడి అభ్యసిస్తున్నారని అభినందించారు. వారు నిర్వహించే కార్యక్రమాలు, ప్రదర్శనలకు తమ వంతు సాయపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణవేణికి రూ.10 వేలు అందివ్వగా.. ఆమె వీరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాబ్ ప్రతినిధులు ముసునూరి సూర్య శ్రీనివాస్, విజ్జపు సత్యనారాయణ, కట్టమూరి రమణరావు, గుగ్గిళ్ల సాయి, కట్టమూరి అశోక్ పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు వద్దంటూ విస్తృత ప్రచారం



మధురవాడలో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: స్మార్ట్ మీటర్ల ఒప్పందం, అదనపు భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు సోమవారం మధురవాడ కళానగర్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు బిగించడానికి చేసుకున్న ఒప్పందం రద్దు చేస్తామని, దాని వల్ల రాష్ట్ర ప్రజలపై 25 ఏళ్ల పాటు రూ.లక్షా పది వేల కోట్ల భారం పడుతుందని, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు రద్దు చేస్తామని ఎన్నికలు ముందు హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలు పక్కన పెట్టి ప్రజలపై రూ.15,485 కోట్లు అదనంగా భారం మోపారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు స్మార్ట్ మీటర్లు అడ్డుకోవాలని, అవసరమైతే పగుల గొట్టాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా నాయకులు వి.సత్యనారాయణ, ఎంఎస్ పాత్రుడు, ఎన్.త్రినాథ్, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు అల్పాహారం



బాలల సంరక్షణ కేంద్రానికి అల్పాహారం అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు 81వ జయంతి సందర్భంగా సోమవారం కేజీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమిలి మండలం తాళ్లవలస భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రానికి అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కాళ్ల శ్రీనివాస్, ప్రతినిధులు పిట్ట వెంకటరావు, సరగడ నరసింగరావు, ఉప్పల సాయిరామ్, కాళ్ల సూర్య, కాళ్ల పురుషోత్తం, మదన్, దీపక్, గణేష్, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్ అధికారికి వీడ్కోలు సత్కారం



పదోన్నతిపై బదిలీ అయిన జగన్‌ను సత్కరిస్తున్న బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు

పీఎం పాలెం. బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న బి.జగన్‌కు ఆర్ఐగా పదోన్నతి ఇస్తూ 8వ పోలీస్ బెటాలియన్ చిత్తూరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం బెటాలియన్ ఆవరణలో 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు ఆధ్వర్యంలో వీడ్కోలు సత్కార కార్యక్రమం నిర్వహించారు. జగన్‌కు పద్మనాభరాజు దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో పదోన్నతిపై బదిలీ అయిన జగన్ చేసిన సేవలను వివరించి కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఇన్‌చార్జి కమాండెంట్ పి.సత్యం, అసిస్టెంట్ కమాండెంట్ ఎన్.మురళీధర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జోన్–2 పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ



జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు



జెడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న రాజీవ్ గృహకల్ప వాసులు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తున్నాయి. కొద్ది నెలలుగా 20పైనే అర్జీలు రావడం విశేషం. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జోన్ పరిధిలోని 9 వార్డుల నుంచి వివిధ సమస్యలపై 21 వినతులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్–5, ఈఈ వర్క్స్–02, వాటర్ సప్లై–04, రెవెన్యూ–1, పబ్లిక్ హెల్త్–02, ఎలక్ట్రికల్–4, యూజీడీ–01, యూసీడీ–02 చొప్పున అర్జీలు అందాయి. జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బక్కన్నపాలెం 234 పోలీస్ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌కు పబ్లిక్ రోడ్డు పునరుద్ధరణ, పవర్ లైన్‌తో కూడిన వీధిలైట్ల కోసం ఎంపీ కృష్ణ, రాజాలు ఫిర్యాదు ఇచ్చారు. కొమ్మాది, బక్కన్నపాలెం టిడ్కో కాలనీల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి, నీరు, విద్యుత్ సదుపాయం కల్పించాలని సీపీఐ నాయకుడు సత్యనారాయణ, జీవీఎంసీ 6వ వార్డు కొత్తూరులో 6 నెలల నుంచి వీధిలైట్లు వెలగడం లేదని పోతిన రమణ, మారికవలస ఆర్‌జీకే కాలనీలో తమ ఇంటి ముందు అక్రమ బడ్డీలు తొలగించమని సూర్యకుమారి, రత్నగిరి హౌసింగ్ కాలనీలో పూర్తిగా పాడైన యూజీడీ వ్యవస్థకు మరమ్మతులు చేయాలని ఆనంద్ కుమార్, జోన్–2 ఆఫీస్ పక్కన పబ్లిక్ ప్రాపర్టీ ఆక్రమణను అరికట్టాలని వెంకట సుబ్బారావు ఇలా పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ తెలిపారు.

జోన్–1కు ఎనిమిది వినతులు

భీమునిపట్నం: భీమిలి జోన్–1 కార్యాలయంలో జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు ఎనిమిది వినతులు అందాయి. ఇంజినీరింగ్ విభాగానికి ఆరు, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు ఒక్కో వినతి వచ్చాయి. ఇక్కడ సమీపంలోని నేరెళ్లవలస కాలనీ శివారు ప్రాంతంలోని రాజీవ్ గృహకల్ప నివాసుల మంచినీటి సమస్య పరిష్కరించాలని సీఐటీయూ జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో జెడ్సీకి వినతిపత్రం అందించారు. త్వరలో సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కోర్టు కేసుతో కదిలిన జీవీఎంసీ యంత్రాంగం



స్వతంత్రనగర్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మధురవాడ: కోర్టు కేసుతో జీవీఎంసీ యంత్రాంగంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. మధురవాడ బొట్టవానిపాలెం ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లోని స్థలంలో ఓ వ్యక్తి ఆలయం పేరుతో ఆక్రమణకు పాల్పడుతున్నాడని, అదే ప్రాంతం బ్రహ్మంగారి గుడి వద్ద కూడా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడంతోపాటు ఓ వ్యక్తి అక్రమ పద్ధతిలో విద్యుత్ కనెక్షన్ పొందాడని, కృష్ణానగర్ సర్వే నంబర్ 166 లచ్చిరాజు లేఅవుట్‌లో కొందరు వ్యక్తులు పార్కులను ఆక్రమించారని, వీటిపై చర్యలు చేపట్టాలని అధికారులకు మధురవాడకు చెందిన సామాజిక కార్యకర్త చేకూరి రజని ఆధ్వర్యంలో కొందరు స్థానికులు పలు దఫాలు ఫిర్యాదులు ఇచ్చారు. చివరికి జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేసినా సరైన పద్ధతిలో స్పందన లేకపోయింది. దీంతో చేకూరి రజని హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిని కోర్టు విచారణకు స్వీకరించినట్టు ఆమె తెలిపారు. ఈ నెల 19న పిటిషనర్‌తోపాటు జీవీఎంసీ అధికారులు కూడా విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. దీంతో తప్పును సరిదిద్దుకోడానికి ఆఘమేఘాల మీద స్వతంత్రనగర్‌లోని సాయిబాబా గుడిని ఆనుకుని పార్కులో ఉన్న షెడ్‌ను, బ్రహ్మంగారి గుడి వద్ద అక్రమ నిర్మాణానికి చెందిన ప్రహరీని జీవీఎంసీ అధికారులు కూలగొట్టారు. అధికారులు తమ అర్జీని పరిష్కరించకుండా తప్పుడు పద్ధతుల్లో క్లోజ్ చేసినట్టు రజని ఆరోపించారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

అక్రమార్కులు ప్రజలను తప్పుదోవ పట్టించి రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తున్నారని, పార్కు ఆక్రమణ తప్పు కాకపోతే జీవీఎంసీ అధికారులు ఎందుకు కూలగొట్టారని సామాజిక కార్యకర్త రజని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు సరికాదని, నిజానిజాలను కోర్టే తేలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.